క్లుప్తంగా

విద్యుత్ లైట్ల ఏర్పాటు



స్తంభాలను ఏర్పాటు చేయిస్తున్న ఎ.రాజు తదితరులు

మోమిన్‌పేట: గ్రామంలోని ముస్లిం శ్మశాన వాటికలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసినట్లు ఎంఐఎం సభ్యుడు, వార్డు మెంబరు ఎ.రాజు తెలిపారు. శ్మశాన వాటికలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో రాత్రి వేళ ఖననం చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లను బిగించినట్లు వివరించారు. ఆయన వెంట మేరాజ్, రఫీ, అర్బజ్, ఆర్యన్, అజాం, తాజ్, అహ్మద్, ఇక్బాల్, షఫీ ఉన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ వీరస్వామి

కుల్కచర్ల: గృహలక్ష్మికి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి, పథకం నోడల్ ఆఫీసర్ వీరస్వామి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పీరంపల్లిలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం నిబంధనలు, సూచనలకు అనుగుణంగా దరఖాస్తులను పరిశీలిస్తున్నామని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య పూలంగి సేవ



అలంకరణలో స్వామివారి మూలమూర్తి

కొడంగల్ : పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అమావాస్య పూలంగి సేవ నిర్వహించారు. స్వామి మూల మూర్తికి అర్చకులు పలు రకాల పూలతో అందంగా అలంకరించారు. పూలంగి సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎల్లయ్యకు 'ప్రశంస'



ధారూరు: ఎల్లయ్యకు ప్రశంసా పత్రం అందిస్తున్న వినోద్‌కుమార్

ధారూరు: రోడ్లు, భవనాల శాఖలో గ్యాంగ్‌మెన్‌గా పనిచేస్తున్న ఎల్లయ్యకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ప్రసంసా పత్రం అందజేశారు. జిల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖలో ఉత్తమ సేవలకు గాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎల్లయ్యను ఎంపిక చేశారు. అలాగే, ధారూరులోని అటవీశాఖ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న తబ్రెస్‌కు జిల్లా ఫారెస్టు అధికారి జ్ఞానేశ్వర్ ప్రసంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్టు డీఆర్‌ఓ జగన్మోహన్, సెక్షన్ ఆఫీసర్లు రాజేందర్‌రెడ్డి, మొయినొద్దీన్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఔట్‌సోర్సింగ్ కార్మికుల నిరవధిక సమ్మె



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

తాండూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కార్యాలయం ఎదుట కార్మికులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేదని వాపోయారు. దీంతో నేటి (గురువారం) నుంచి 250 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులందరూ నిరవధిక ధర్నా చేయనున్నట్లు తెలిపారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, 11వ పీఆర్సీ వేతన బకాయిలు, మేడే సందర్భంగా పెంచిన రూ.1000లను అందజేయాలని, అలాగే నిలిపేసిన 18 మంది కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లను వెంటనే కౌన్సిల్ సమావేశంలో చేర్చడంతో పాటు ప్రభుత్వానికి చేరవేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లాకు కార్మికులు వినతిపత్రం అందజేశారు.

లైన్ క్లియర్

- తాండూరు మార్కెట్ కమిటీ పాలక వర్గం ఏర్పాటుకు ఎమ్మెల్యే నిర్ణయం
- ఛైర్‌పర్సన్‌గా గద్దె వీణ పేరు ప్రతిపాదన
- పది రోజుల్లో కొలువుదీరనున్న సభ్యులు



తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఏర్పాటుకు లైన్‌క్లియరైంది. గతేడాది అక్టోబర్ నెలలో మార్కెట్ కమిటీ పాలక వర్గం గడువు ముగిసింది. 9 నెలలుగా ఛైర్‌పర్సన్ పదవి కోసం పలువురు ఆశావహులు పోటీ పడ్డారు. దీంతో అప్పటి నుంచి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నూతన కమిటీ నియామకాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోండటంతో కమిటీ ఏర్పాటు చేయాలని భావించారు. ఈ క్రమంలో తాండూరుకు చెందిన ముఖ్య నాయకులతో కలిసి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ కోసం అభిప్రాయాలు సేకరించారు. పలువురు తాండూరు పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నేత గద్దె శ్రీనివాసచారి సతీమణి వీణ పేరును సూచించారు. నాయకుల అభిప్రాయాన్ని ఏకీభవించి వీణను మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పదవికి నామినేట్ చేస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తానని ఎమ్మెల్యే నాయకులకు తెలిపారు.

గాడి తప్పిన పాలన..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే తొలి వ్యవసాయ మార్కెట్ కమిటీగా దశాబ్దాల కాలంగా కొనసాగుతోంది. ఏడాది పొడవునా మార్కెట్‌లో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు జరుగుతాయి. దీంతో మార్కెట్ యార్డులో వందల కోట్లలో వ్యాపారంతో పాటు రూ.కోట్ల ఆదాయం మార్కెట్‌కు ఫీజు రూపంలో సమకూరుతోంది. గతేడాది అక్టోబర్ నెలలో ఛైర్‌పర్సన్‌గా ఉన్న విఠల్‌నాయక్ పదవీకాలం ముగిసింది. నాటి నుంచి ప్రత్యేకాధికారిగా డిప్యూటీ డైరెక్టర్ కొనసాగారు. నెలకోసారి కూడా మార్కెట్ యార్డును సందర్శించకపోవడంతో నిర్వహణ గాడి తప్పింది. దీంతో మార్కెట్ కమిటీ నిర్వహణపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తాయి. గతంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా మున్సిపల్ కౌన్సిలర్ విజయాదేవి పేరును పరిశీలించారు. మరి కొందరు తీవ్ర పోటీ పడటంతో పాలక మండలి ఏర్పాటును వాయిదా వేశారు. ఇటీవల మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ దీపనర్సింహులు భర్త బీఆర్‌ఎస్ నాయకులు పట్లోళ్ల నర్సింహులు మంత్రాంగం నడిపించి తన స్నేహితుడైన శ్రీనివాసచారి సతీమణికి పదవి దక్కేలా చేసిన ప్రయత్నాలు ఫలించాయని పలువురు చర్చించుకుంటున్నారు. మరోవారం లేదా పక్షం రోజుల్లో నూతన పాలక వర్గం పదవీ ప్రమాణ స్వీకారం చేసేలా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చర్యలు చేపట్టారు.

రెగ్యులరైజ్ చేయాలంటూ నిరసన



తాండూరు టౌన్: మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు

తాండూరు టౌన్: తమను రెగ్యులరైజ్ చేయాలంటూ సెకండ్ ఏఎన్‌ఎంలు సీఐటీయూల ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖలోని మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ తదితరులను రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం ఏఎన్‌ఎంల వరకు వచ్చే సరికి మాట మార్చడం తగదన్నారు. ఏఎన్‌ఎంల జిల్లా ఉపాధ్యక్షురాలు వెంకటమ్మ, డివిజన్ అధ్యక్షురాలు శాంత, ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

కొడంగల్ రూరల్: కాంట్రాక్ట్ ఎంపీహెచ్ఏ(ఎఫ్)లను రెగ్యులర్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌ఎం.ప్రశాంతు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో సమస్యలను పరిష్కరించాలని సెకండ్ ఏఎన్‌ఎంలు నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొని మాట్లాడారు. 02/2023 నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎన్‌ఎంలను మళ్లీ పరీక్షలు రాయమనడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌన్సిలర్ శంకర్‌నాయక్, కృష్ణంరాజు, నయీమ్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట..

అనంతగిరి: ప్రభుత్వం వెంటనే తమను ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు లలిత, పాపమ్మ శోభ అన్నారు. బుధవారం సెకండ్ ఏఎన్‌ఎంలు ఆర్డీఓ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత 20 ఏళ్లను నుంచి వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీఓ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్. ఏఎన్‌ఎంలు సుహాసిని,సృజాత,శోభ,మాణిక్యమ్మ, పాల్గొన్నారు.

డిమాండ్లను నెరవేర్చాలి

పరిగి: తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరుతూ కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు బుధవారం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి వెట్టి చాకిరి చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిష్కరించాలన్నారు. ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ నేడు విస్మరించారని వాపోయారు. కార్యక్రమంలో గౌరీ, చంద్రకళ, పుష్ప, వర్ధమాల, సలీమా పాల్గొన్నారు.

నేడు పూడూరుకు ఎంపీ రంజిత్‌రెడ్డి రాక

పూడూరు: చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డితో కలిసి ఆరోగ్య రథం సేవలను ప్రారంభించేందుకు వస్తున్నారని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉ.10 గంటలకు పూడూరు మండల కేంద్రంలో ఆరోగ్య సేవలు ప్రారంభిస్తారని తెలిపారు. ఆరోగ్య రథం సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

రేపు సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

బొంరాస్‌పేట: మండలంలోని తుంకిమెట్లలో 18న(రేపు) సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ ఉంటుందని మండల గౌడసంఘం నాయకులు శేఖర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటలకు జరిగే విగ్రహావిష్కరణకు విగ్రహ దాత ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ మురళీకృష్ణగౌడ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. గౌడకులస్తులంతా హాజరుకావాలన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

బొంరాస్‌పేట: పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో మండలంలోని లింగస్‌పల్లికి చెందిన కాశప్పకు రూ.80వేల చెక్కును అందజేశారు. నిరుపేదలు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు దోమలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పర్యటన

దోమ: ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి గురువారం దోమ మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని శివారెడ్డిపల్లిలో మనఊరు–మనబడి పాఠశాల ప్రారంభించనున్నారు. అనంతరం బొంపల్లిలో ఈద్గా నిర్మాణానికి భూమిపూజ చేయడానికి రానున్నారని ఆయన సహాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీఆర్‌పీల ఆందోళన



బొంరాస్‌పేట: ఆందోళన చేస్తున్న సీఆర్‌పీలు

బొంరాస్‌పేట: విద్యాశాఖలో పనిచేస్తున్న సీఆర్‌పీలు తమ సమస్యలను పరిష్కరించి వేతన సవరణలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం చేపట్టిన ఆందోళనలో కొడంగల్ నియోజకవర్గ సీఆర్‌పీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతియుతంగా చేపట్టిన ఆందోళలను చెదరగొట్టి తమ సమస్యలను వినేందుకు నిరాకరించడం సరికాదన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సీఆర్‌పీల ఆందోళనకు మద్దతు తెలిపారని అన్నారు.

బొంరాస్‌పేట తహసీల్దార్‌గా వెంకటేశ్



బొంరాస్‌పేట: మండల తహసీల్దార్‌గా వై.వెంకటేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం తహసీల్దార్‌గా ఉన్న వెంకటేశ్ ఇక్కడికి బదిలీ అయ్యారు. మండల ప్రముఖులు ఆయనను శాలువాలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. మండల రెవెన్యూ సమస్యలను తీర్చి ప్రజలకు సేవలందిస్తానని ఆయన చెప్పారు. ఇదివరకు తహసీల్దార్‌గా పనిచేసిన షర్మిల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు.

సంక్షిప్త వార్తలు

❖ జింకను కాపాడిన స్థానికులు

అనంతగిరి: అనంతగిరి గుట్ట ఆలయం సమీపంలో బుధవారం ఓ జింక దేవాలయం ప్రహరీ దూకి వచ్చింది. కుక్కలు దాడి చేయడంతో పరుగులు పెడుతూ వచ్చిన జింక పిల్లను స్థానికులు గమనించి కాపాడారు. దీంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు జింక పిల్లను పశువైద్యశాలకు తీసుకువెళ్లి చికిత్స అందించారు.

❖ నేటి నుంచి నిత్యాన్నదానం

అనంతగిరి: శ్రావణమాసం పురస్కరించుకుని వికారాబాద్ పట్టణానికి సమీపం ఉన్న బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి నెల రోజుల పాటు నిత్యాన్నదానం చేపడుతున్నట్లు వీరశైవ సమాజం వికారాబాద్ శాఖ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

❖ ప్రతి మహిళ ఆర్థికంగా స్థిరపడాలి



నూతన కార్యవర్గాన్ని సన్మానించిన ఎంపీపీ

మర్పల్లి: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ బట్టు లలిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళా సమైఖ్య భవనంలో ఇందిర క్రాంతి పథకం ఆధ్వర్యంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల మహిళా సమైఖ్య నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ లలిత పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను మహిళ సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొ ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం మండల మహిళ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ కృష్ణరావు, కోఆప్షన్ సభ్యులు సోయేల్, ఏపీఎం పోచయ్య, మండల మహిళ సమైఖ్య మాజీ అధ్యక్షురాలు పూలమ్మ, ఆయా గ్రామాల సీసీలు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపీపీ లలిత శాలువా కప్పి సన్మానించారు.

❖ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

బంట్వారం: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారమని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కోట్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్ ఆధ్వర్యంలో కొత్తపల్లిలో గ్రామ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అయూబ్ అన్సారి మాట్లాడారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అప్పట్లో వేసిన రోడ్లపై ఇప్పటి పాలకులు తట్టెడు మట్టి కూడా వేయాలేదని విమర్శించారు.వికారాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తామన్నారు. కార్యక్రమంలో బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు రాంచందర్ , ఏసయ్య, రాచిరెడ్డి, రాము నాయక్, అక్బర్, శ్రీనివాస్,ప్రభాకర్‌రెడ్డి ,సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆనంద్ పాల్గొన్నారు.

❖ రేపు విద్యాహక్కుచట్టం, బాల్యవివాహాలపై సమావేశం

కుల్కచర్ల: విద్యాహక్కు చట్టం అమలు, బాల్య వివాహాల నిర్మూలన అంశంపై ఈనెల 18న మండల కేంద్రంలో సమావేశం నిర్వహించనున్నట్లు పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. బుధవారం కుల్కచర్లలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పాలనలో విద్యాహక్కు చట్టం అమలు, బాల్యవివాహాల నిర్మూలన, సామాజిక బాధ్యత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ప్రముఖ వక్త భాస్కరయోగి, పరిగి డీఎస్పీ కరుణసాగర్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్ని యువజన సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు హాజరై తమ అభిప్రాయాలను పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, హన్మంతు, హరికృష్ణ, గోపాలకృష్ణ, బాలకృష్ణ, బచ్చయ్య,రాములు, శేఖర్ పాల్గొన్నారు.

పత్తి సాగులో మెలకువలు పాటించాలి

వ్యవసాయ సంచాలకురాలు సౌభాగ్య లక్ష్మీకుమారి



పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సౌభాగ్యలక్ష్మీకుమారి

దోమ: రైతులు సాగు చేసిన పత్తి పంటలో వ్యవసాయ అధికారుల సూచనల, సలహాల మేరకు అవసరమైన మందులను పిచికారీ చేసుకోవాలని పరిగి వ్యవసాయ సంచాలకురాలు సౌభాగ్యలక్ష్మీ కుమారి సూచించారు. బుధవారం మండలంలోని దాదాపూర్‌లో పత్తి పంటను ఏఈఓ చెన్నయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తి పంటలకు తెగుళ్ల బెడద వాటిల్లిందన్నారు. అధిక వర్షాలు కురిసి పంటలు దెబ్బతినడంతో పాటు వర్షాలు కురువకపోవడంతో పత్తి పంటలు ఎర్ర బారుతూ జింకు లోపంతో పాడైపోతున్నాయన్నారు. దీని నుంచి ఉపశమనం పొందేందుకు లీటరు నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్, రెండు గ్రాముల జింకు సల్ఫేట్‌తో పాటు మొక్కల్లో తేమ శాతం కోల్పోకుండా 20 గ్రాముల యూరియా, లేదా డీఏపీ వేసుకొని మొక్కలపై పిచికారీ చేసుకోవాలన్నారు. దీంతో మొక్కలు రంగు మారి ఎదుగుదలకు దోహదపడుతాయని తెలిపారు. ప్రతి రైతు తాను సాగు చేసిన పంటలను తెగుళ్ల బారిన నుంచి కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి అవసరమైన మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనానికి తరలిన అర్చకులు



డీడీఎన్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మతో జిల్లా అర్చకులు

కొడంగల్ రూరల్: దూపదీప నైవేద్య అర్చక సంఘం(డీడీఎస్ఎస్) ఆధ్వర్యంలో బుధవారం షాద్‌నగర్ టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆత్మీయ సమ్మేళనానికి అర్చకుల బృందం తరలివెళ్లారు. కార్యక్రమంలో డీడీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మకు జిల్లా డీడీఎస్ఎస్ అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి వినతి పత్రం అందజేశారు. ఇటీవల కొత్తగా నియామకమై ప్రొసీడింగ్ అందుకున్న అర్చకులకు ప్రభుత్వం నుంచి నోటిఫైడ్ అందించాలని, ఎండోమెంట్ శాఖ ద్వారా వేతనాలు అందించేలా కృషి చేయాలని వినతిలో పేర్కొన్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన 10వేల వేతనానికి సంబంధించి జీఓ విడుదల చేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీడీఎస్ఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చంద్రకాంత్‌రావు, సంఘం కార్యవర్గ సభ్యులు అఖిలేశ్, శ్రీకాంతాచారి తదితరులు తరలివెళ్లారు.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కుల్కచర్ల: నిస్వార్థ సేవకుడిగా దేశ ప్రజల ఉన్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తుల్లో అటల్ బిహారీ వాజ్‌పేయి ఒకరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్యలు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయభావాలను పెంపొందించడంతో పాటుగా అవకాశవాద రాజకీయాలకు దూరంగా సుపరిపాలన అందించిన గొప్ప ప్రధాని వాజ్‌పేయి అని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైపాల్, మాజీ అధ్యక్షుడు అంజిలయ్య, మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, వార్డు సభ్యులు మైపాల్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కార్యాలయ ముట్టడికి తరలిన ఉద్యోగులు



కార్యాలయ ముట్టడిలో పాల్గొన్న ఉద్యోగులు

కొడంగల్ రూరల్ : సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు హైదరాబాద్‌లోని విద్యాశాఖ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్(ఎస్‌పీడీ) కార్యాలయ ముట్టడికి బుధవారం ఉద్యోగుల సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైమ్ స్కేల్(ఎంటీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియా అందించాలని, విద్యాశాఖ ఉద్యోగ నియామకాల్లో వెయిటేజ్ ఇవ్వాలని కోరుతూ కార్యాలయ ముట్టడికి తరలుతున్నట్లు వారు తెలిపారు. విద్యాశాఖలో 2012నుంచి వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని, చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆరోపించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాఘవేందర్, సీఆర్‌పీలు శ్రీనివాస్, దస్తప్ప, ఆపరేటర్ వెంకటయ్య, పీటీఐలు తిరుమలేష్, శంకరయ్య, వేణు, వెంకట్రావ్, నాగరాజు, మెసెంజర్ కృష్ణ తరలివెళ్లారు.

ప్రమాదపుటంచున సర్కారీ చదువులు



తరగతి గదిలో వెనక భాగంలో ఉన్న టీఫైబర్ కేబుల్స్ మిషనరీ

కుల్కచర్ల: అధికారుల నిర్లక్ష్య విధానాల వల్ల చిన్నారుల తల్లిదండ్రులు భయం భయంగానే తమ పిల్లలను బడులకు పంపిస్తున్నారు. చౌడాపూర్ మండలం బంగ్రంపల్లి ప్రాథమిక పాఠశాలలో 35మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో రెండు చిన్నచిన్న గదులు ఉండగా ఒకదాంట్లో వివిధ సామగ్రితో సగం పిల్లలు కుర్చుంటున్నారు. మరొక గదిలో గ్రామపంచాయతీ కార్యాలయంలో పెట్టాల్సిన టీ ఫైబర్ నెట్ కేబుల్స్, మిషనరీ సామగ్రి పాఠశాల గదిలో పెట్టడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. విద్యార్థులు తెలియక వైర్లను ముట్టుకుంటే షాక్ కొట్టే పరిస్థితి నెలకొంది. పాఠశాలకు సంబంధంలేని కేబుల్స్‌ను పాఠశాల గదిలో పెట్టడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా అపశ్రుతి జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణను వివరణ కోరగా మండల అధికారులకు పలుమార్లు విషయాన్ని తెలియజేశామని చెప్పారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ఈవీఎంపై ఓటు ఎలావేయాలో వివరిస్తున్న అధికారులు

కుల్కచర్ల : ఈవీఎంల్లో ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ లింగయ్య పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్‌లో ఓటుహక్కు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఈవీఎం మిషన్లపై ఓటు వేసే విధానం తెలుసుకోవాలన్నారు. ఓటర్లు అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని ఓటు వినియోగం గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కుండీల్లో మొక్కలు ఏవి?



ఖాళీగా ఉన్న కుండీలు

వికారాబాద్ అర్బన్: గత ఏడాది హరితహారంలో భాగంగా పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా నుంచి ఆలంపల్లి వరకు సుమారు రూ.5.20లక్షలు ఖర్చు చేసి 550 కుండీలను డివైడర్‌పై పెట్టించి డిజైన్ మొక్కలను నాటించారు. అయితే, ఏడాది గడవక ముందే సగం మొక్కలు ఎండిపోయి, ఖాళీ కుండీలు మిగిలాయి. అనేక చోట్ల వాహనాలు తాకడంతో కుండీలు పగిలిపోయాయి. ఇలా డివైడర్‌పై కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచడం ఏమాత్రం మంచిది కాదని, వాహనాల రాకపోకలతో పగిలిపోతాయని పట్టణవాసులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. కేవలం హరితహారంలో డబ్బులు ఖర్చు చేయాలనే లక్ష్యంతో ఈ మొక్కలను నాటించడంతో లక్ష్యం కాస్త నీరు గారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అక్కడ ఉన్న కొన్ని మొక్కలనైనా రోజు నీరు పోయించి కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.